క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన కాకాణికి శ్యామ్‌సింగ్ కృతజ్ఞతలను తెలియజేశారు. తొలుత ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో శ్యామ్‌సింగ్ కలిసి పూలమొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

గ్లకోమాపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న శర్వాణి

నెల్లూరు(అర్బన్): గ్లకోమాపై అవగాహన పెంపొందించుకొని తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా అంధత్వ నివారణాధికారి శర్వాణి పేర్కొన్నారు. గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడారు. బీపీ, షుగర్ బాధితులు, 40 ఏళ్లు దాటినా, కుటుంబంలో ఎవరికైనా గతంలో గ్లకోమా వచ్చిన వారికి ఈ జబ్బు వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. 40 ఏళ్లు దాటిన వారు ఆర్నెల్లకోసారి గ్లకోమా పరీక్షను చేయించుకోవాలని కోరారు. వారోత్సవాలను అన్ని ఆస్పత్రుల్లో ఈ నెల 15 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. కాగా గతేడాది ఆగస్ట్ నుంచి చేపట్టిన స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా 524 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 1,05,525 మంది విద్యార్థులకు నేత్ర స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించగా, వీరిలో 4801 మందికి కళ్లద్దాలను అందజేశామని చెప్పారు.

వాటర్ కూలర్ వితరణ




నెల్లూరు(బృందావనం): కొత్తూరులోని నెహ్రూ భారతి వృద్ధాశ్రమానికి వాటర్ కూలర్‌ను బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ షో యువర్ లౌ అగాపె టీమ్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. కృపారాజన్, రెవరెండ్ డాక్టర్ మణిరావు, అంకయ్య, మేరీ సరళ, ప్రభావతి, షీలా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసును సంతపేట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరులోని అంబాపురానికి చెందిన మురళీధర్ (65), దేవసేన దంపతులు. కుటుంబకలహాల నేపథ్యంలో తన కుమారుడ్ని తీసుకొని కొన్నేళ్ల క్రితం ఆమె వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. ఒంటరితనం ఆయన్ను కుంగదీసింది. ఈ క్రమంలో కొత్తహాల్ సమీపంలోని హరితా లాడ్జిలో గదిని శనివారం అద్దెకు తీసుకున్నారు. భార్యాపిల్లలకు దూరంగా ఉండటం, ఇతర సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఆయన తన వెంట తెచ్చుకున్న గడ్డి మందును తాగారు. అనంతరం జరిగిన విషయాన్ని తన స్నేహితులు వసంత్, చిట్టిబాబుకు తెలియజేశారు. లాడ్జి వద్దకు వారు చేరుకొని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో మురళీధర్‌ను చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి ఆయన మృతి చెందారు. సమాచారం అందుకున్న అక్కాచెల్లెళ్లు నెల్లూరు చేరుకొని మురళీధర్ మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి చెల్లెలు గోపీ నిర్మల.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రికి ఎస్సై సుల్తాన్‌బాషా చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఘనంగా శ్రీరాములు జయంతి



నెల్లూరు(అర్బన్): ఏపీ ఎన్జీఓ సంఘ స్థాపనలో, అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించిన ఆమనగంటి శ్రీరాములు 104వ జయంతిని దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నేతలు ఆంజనేయవర్మ, శ్రీనివాసులు, చిన అంకయ్య, విద్యాసాగర్, నళినికుమార్, కరుణమ్మ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పానీ పూరీ.. మహా క్రేజీ

- ఉత్సాహం చూపుతున్న యువత
- నగరంలో భారీగా ఏర్పాటు
- కాలువల పక్కనే ఉండటంతో వ్యాధులొచ్చే అవకాశం
- నాణ్యత ప్రమాణాలను పాటించని కొందరు



పానీ పూరీ బండి వద్ద చిన్నారులు

నెల్లూరు (పొగతోట): కోవిడ్ అనంతరం నగరంలో పానీ పూరీల బండ్లు, చిరుతిండ్ల దుకాణాలు అధికమైపోయాయి. పానీ పూరీ, కట్‌లెట్స్, భేల్ పూరీ, మసాలాపూరీ తదితరాలపై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ బండ్ల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు విపరీతమైన రద్దీ ఉంటోంది. నగరంలో వీధికొకటి చొప్పున వీటిని ఏర్పాటు చేశారు.

దాదాపు 1500 బండ్లు

ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వారు పానీ పూరీ బండ్లను నగరంలో ఏర్పాటు చేస్తున్నారు. చిల్డ్రన్స్ పార్కు, మినీబైపాస్, చిన్నబజార్, పెద్దబజార్, ట్రంక్‌రోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట.. ఇలా ప్రతి చోట ఇవి దర్శనమిస్తున్నాయి. నగరంలో 1500కుపైగా పానీ పూరీ బండ్లు ఉంటాయని అంచనా. ముడిసరుకు అందుబాటులో ఉండటంతో వాటిపై అనుభవం ఉన్న వారు దుకాణాలను ఏర్పాటు చేసి జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఇందులో నాణ్యత ప్రమాణాలను పాటించడంలేదనే ఆరోపణలూ ఉన్నాయి. కల్తీ నూనెను వినియోగిస్తుండటంతో పలువురు అనారోగ్యానికి గురవుతున్నారు. అధిక శాతం పానీ పూరీ బండ్లను కాలువల పక్కనే ఏర్పాటు చేస్తున్నారు. గదులు తీసుకొని నిర్వహించాలంటే బాడుగలు, అడ్వాన్స్‌ల మోత ఎక్కువగా ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. కాలువల వద్ద దోమలు, ఈగలు ఆహార పదార్థాలపై వాలి ప్రజలను రోగాల బారిన పడేస్తున్నాయి.

రోజూ తింటా

పానీ పూరీ బండ్లు ఎక్కడ ఉంటే అక్కడికెళ్లి తింటా. వారంలో ఒక ట్రెండుసార్లు కుటుంబంతో సహా వెళ్తున్నాం. రుచిగానే ఉంటున్నాయి.

– ప్రసాద్, బాలాజీనగర్

తనిఖీలు నిర్వహిస్తాం

నగరంలో ఇటీవలి కాలంలో పానీ పూరీ బండ్లు ఎక్కువయ్యాయి. నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలి. చుట్టుపక్కల పారిశుధ్యం బాగుండేలా చూసుకోవాలి. దుర్గంధం వెదజల్లే ప్రాంతాల్లో నిర్వహిస్తే చర్యలు చేపడతాం. ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని తనిఖీలు జరుపుతాం.

– చైతన్య, ఎంహెచ్‌ఓ

యువత పోరు రేపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయకుమార్‌రెడ్డి తదితరులు

- ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి అమల్లో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ యువత పోరు పేరిట కలెక్టరేట్ వద్ద ఆందోళనను బుధవారం చేపట్టనున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి సోమవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంబరాలను నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళనను చేపట్టనున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ప్రజలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. యువత పోరుకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(బారకాసు): రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో నగరపాలక సంస్థ పరిధిలోని 12 మంది వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, ఇన్‌చార్జి అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులను కమిషనర్ సూర్యతేజ జారీ చేశారు. లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఏసీ స్టేడియంలో మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న వసుంధర

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మహిళా దినోత్సవాన్ని ఆ స్టేడియం మహిళా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఇటీవల నిర్వహించిన క్రీడల్లో పాల్గొని పతకాలను సాధించిన మహిళా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సునీత, హైమావతి, సరోజ, పద్మావతిని సత్కరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ వసుంధర, సెక్రటరీ జయరాణి, ట్రెజరర్ మగ్బూలా, వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు అంకిరెడ్డి, రాఘవేంద్రశెట్టి, రాఘవరెడ్డి, బలరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చర్యలు



అర్జీలను స్వీకరిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో 120 మైక్రాన్ల కన్నా తక్కువ స్థాయి గల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, రవాణా, విక్రయం తదితరాలను నిషేధిస్తున్నామని, వీటిని విక్రయిస్తే చర్యలు తప్పవని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. వినతిపత్రాలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీని ఇక నుంచి ఆపేయాలని ఆదేశించారు. దుకాణాలపై దాడులను తరచూ చేపడతామని, నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలను విధిస్తామని స్పష్టం చేశారు. మొత్తం 66 అర్జీలు అందాయని చెప్పారు. అదనపు కమిషనర్ నందన్, ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్‌ఓ చైతన్య, ఏసీపీ వేణు, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన భూగర్భ డ్రైనేజీ పనులు

నగరంలోని అన్ని గృహాల డ్రెయిన్ కనెక్షన్లను భూగర్భ డ్రైనేజీకి అనుసంధానం చేసేలా అవగాహన కల్పించి, ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఎల్ అండ్ టీ, మెగా కంపెనీల ప్రతినిధులు, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ విభాగాధికారులు, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో వారాంతపు సమావేశాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. తాగునీటి కుళాయి కనెక్షన్ల పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై వ్యర్థాలేస్తున్న వారిని గుర్తించి, జరిమానాలను విధించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. 14వ డివిజన్లోని బాలాజీనగర్, ఏసీ నగర్, ద్వారకమాయినగర్, శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఎస్వీజీఎస్ కాలేజీ రోడ్డుపై చెత్త వేస్తున్న వాహనాలను గుర్తించి పెనాల్టీలు విధించాలని చెప్పారు. ప్రయాగ్‌రాజ్ నుంచి వచ్చిన ఎలక్ట్రిక్ చెత్త సేకరణ వాహన పనితీరును 14వ డివిజన్లో పరిశీలిస్తున్నామని, బాగుంటే మరికొన్ని వాహనాలను తెప్పించనున్నామని వెల్లడించారు. ఏసీనగర్ వద్ద భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డుకు అడ్డంగా ఉంచడాన్ని గమనించిన ఆయన యజమానులకు నోటీసులను జారీ చేయాలని సూచించారు. కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్‌ఓ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, డీఈఈలు రఘురామ్, ముజాహిద్దీన్, ఏసీపీ ప్రకాష్, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, సర్వేయర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దోమల మోత

నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో దోమల బెడద తీవ్రంగా ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని ఓ ప్రయాణికుడు కోరారు. డయల్ యువర్ డీఎం – 1 కార్యక్రమాన్ని మేనేజర్ మురళీకృష్ణ సోమవారం నిర్వహించారు. నెల్లూరు నుంచి పామూరుకు ఎక్స్‌ప్రెస్ బస్సును నడపాలని.. సర్వోదయ కళాశాల ఎదుట ఆర్టీసీ బస్సులను నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని.. నెల్లూరు నుంచి కొండబిట్రగుంటకు బుధవారం నుంచి శుక్రవారం వరకు బస్సులను నడపాలని పలువురు కోరారు. ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ములుమూడి బస్టాండ్ సమీపంలో 11 కేవీ తీగలను మార్చనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నబజార్, గుప్తాపార్క్, ములుమూడి బస్టాండ్, కటారిపాళెం, అగ్నిపేట, మండపాలవీధి తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

వ్యక్తిపై చర్యలకు వినతి

నెల్లూరు(క్రైమ్): పార్టీ నుంచి తొలగించామనే అక్కసుతో తమపై అసత్య ప్రచారాలు చేస్తున్న మహబూబ్‌బాషాపై చర్యలు చేపట్టాలని రిపబ్లికన్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి వెంకటరమణయ్య కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ కృష్ణకాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ నగర కమిటీ నియామకం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నూతన కమిటీని నియమించారు. ఈ మేరకు పార్టీ నగరాధ్యక్షుడు నారపురెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డికి జాబితా, నియామక ఉత్తర్వులను విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సోమవారం అందజేశారు. పార్టీ జనరల్ సెక్రటరీగా వావిటపర్తి సుధీర్, ఉపాధ్యక్షులుగా సంజయ్‌కుమార్, అల్లాబక్షు, ఇర్ఫాన్, సుస్మితారెడ్డి, సెక్రటరీగా ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా నాగిరెడ్డి రాజేష్, ట్రెజరర్‌గా చీపినాపి ధనుంజయను నియమించారు.

ఘన సన్మానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్ రఘురామిరెడ్డిని సేవాభూషణ్ బిరుదుతో సత్కరించారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు, మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, మహేష్ పాల్గొన్నారు.

నైతిక విలువలపై అవగాహన



నెల్లూరు(అర్బన్): ప్రపంచ అశాంతికి మనిషి దురాశే కారణమని బెంగళూరుకు చెందిన బ్రహ్మయోగిని ఛాయా సిస్టర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నైతిక విలువలు అనే అంశంపై అవగాహన సదస్సును నగరంలోని సుస్మిత నర్సింగ్ కళాశాలలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆమెను సత్కరించారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, సిస్టర్ సుమతి బ్రహ్మకుమారి, శ్రీనివాసులు, శిల్ప, సుప్రియ, మేరీ లోహిత, సల్మా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫైళ్ల అందజేత



నెల్లూరు (టౌన్): నగరంలోని సుంకు చెంగన్న మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు ఫైళ్లను సోమవారం అందజేశారు. డాక్టర్ ఇంద్రనీల్ జన్మదినాన్ని పురస్కరించుకొని వీటిని తండ్రి డాక్టర్ ఎస్పెస్ రెడ్డి ఇచ్చారు. దత్తత తీసుకున్న ఇద్దరు విద్యార్థులకు వస్త్రాలను అందజేశారు. హెచ్‌ఎం అరవింద, రాఘవేంద్ర, అమరేంద్రరెడ్డి, రవిచంద్ర, గోపీనాథ్, బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.

డయాలసిస్ మెషీన్ల వితరణ



నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రికి రూ.12 లక్షల విలువైన డయాలసిస్ యంత్రాలను భగవాన్ మహావీర్ ట్రస్ట్ చొరవతో, జైన సేవాసదన్ అధ్యక్షుడు శాంతిలాల్ జైన్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా శాంతిలాల్ జైన్ మాట్లాడారు. జయభారత్ ఆస్పత్రిలో పది మెషీన్లతో ప్రారంభమైన భగవాన్ మహావీర్ డయాలసిస్ విభాగం, నేడు 20 యంత్రాలతో పనిచేస్తోందని చెప్పారు. ఇక్కడి ఐసీయూ విభాగాన్ని సోహన్లాల్ జైన్ షష్టిపూర్తిని పురస్కరించుకొని ఆధునికీకరించామని తెలిపారు. ఆస్పత్రి కోశాధికారి గుర్రం సుధాకర్, ట్రస్ట్ కార్యదర్శి జీపీ జైన్, పరస్మాల్ జైన్, మిశ్రమల్‌జైన్ పాల్గొన్నారు.

పత్తి రవీంద్రబాబుకు నివాళి



నెల్లూరు(బారకాసు): సాయినాథ్ అండ్ కో అధినేత పత్తి రవీంద్రబాబు మృతి చెందడంతో కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని శాంతి అపార్ట్‌మెంట్స్‌లో గల ఆయన ఫ్లాట్‌కు వెళ్లి పలువురు సోమవారం నివాళులర్పించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పొట్టేపాళెంలోని దళితవాడ సమీపంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. చేపలవేటకెళ్లి నీటిలో మునిగి 40 ఏళ్లలోపు గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఛాతి, మోచేయి, కుడిభుజంపై పచ్చబొట్లున్నాయి. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని సీఐ వేణు కోరారు.



పన్నులను దౌర్జన్యంగా వసూలు చేస్తే సహించబోం



ప్రజా చైతన్య యాత్రలో సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో పన్నులను దౌర్జన్యంగా వసూలు చేస్తామంటే సహించేదిలేదని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 53వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరపురం, పునరావాసకాలనీ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖజానాను నింపేందుకు గానూ కార్పొరేషన్ పరిధిలో 166 ప్రత్యేక టీమ్ సభ్యులు పన్నులు చెల్లించాలంటూ ప్రజలను ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. మంచినీరివ్వకుండానే కుళాయి పన్నులను ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. నేతలు మూలం ప్రసాద్, గడ్డం శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, మధు, భయ్యన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర అమలుపై రిపోర్టు ఇవ్వండి

నెల్లూరు రూరల్: స్వచ్ఛాంధ్ర కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో తెలియజేయాలంటూ అధికారులపై కలెక్టర్ ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్లోని తిక్కన భవన్‌లో అధికారులతో సోమవారం ఆయన చర్చించారు. జిల్లాలో ప్లాస్టిక్ వ్యర్థాలు, రీసైక్లింగ్ విధానాలు, చెత్త సేకరణలో నిర్లక్ష్యం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారానే వివరాలను అందించాలని ఆదేశించారు. ఆదేశాలిచ్చి అధికారులు చేతులు దులుపుకొంటున్నారని, క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని విభాగాలకు సంబంధించిన నివేదికలను ఈ నెల 15లోపు తన ముందుంచాలని, లేని పక్షంలో హెచ్‌ఓడీలకు షోకాజ్ నోటీసులను జారీ చేస్తామని స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్రపై సమీక్షను 15 రోజులకోసారి నిర్వహిస్తామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై డాక్యుమెంటరీని రూపొందించి ఫొటోలను అందించాలని సూచించారు. జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ, డీఆర్డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు నాగరాజకుమారి, గంగాభవాని, వేణుగోపాల్, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ గంగాధర్, ఎంహెచ్‌ఓ చైతన్య, డీఈఓ బాలాజీరావు, డీటీసీ చందర్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా సర్వే అధికారి నాగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ ఫిల్మ్‌లపై కొనసాగుతున్న డ్రైవ్



నెల్లూరు (టౌన్): వాహనాలపై బ్లాక్ ఫిల్మ్, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్‌ను జిల్లాతో పాటు నగరంలో రవాణా శాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. 'అడిగే దమ్ముందా' అనే శీర్షికన సాక్షిలో కథనం ఇటీవల ప్రచురితమైంది. ఈ తరుణంలో డీటీసీ చందర్ ఆదేశాల మేరకు హరనాథపురం, రామలింగాపురం, చిల్డ్రన్స్‌పార్కు తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలను రవాణా శాఖ అధికారులు సోమవారం చేపట్టారు. బ్లాక్ ఫిల్మ్.. నిబంధనలను విరుద్ధంగా నంబర్ ప్లేట్లున్న 20 కార్లు, బైక్‌లపై కేసులు నమోదు చేశారు. కొన్ని కార్లకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను అక్కడే తొలగించారు. ఎంవీఐలు మహమ్మద్ రఫీ, కార్తీక్ పవన్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ



శేషవాహనంపై రంగడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణాన్ని తెల్లవారుజామున నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథుడి నగరోత్సవం పురవీధుల్లో వేడుకగా సాగింది. ఉభయకర్తలుగా కోలాటి శ్రీనివాసులు తదితరులు వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేషవాహనంపై స్వామివారు రాత్రి అనుగ్రహించారు. కాగా సూర్యప్రభ, హంసవాహనంపై రంగడు బుధవారం విహరించనున్నారు.



ధ్వజారోహణ

సావిత్రిబాయి పూలేకు నివాళి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సావిత్రిబాయి పూలే వర్ధంతిని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నగరంలోని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిపిన కార్యక్రమంలో పూలే విగ్రహాలకు నివాళులర్పించారు.

నెల్లూరు (టౌన్): కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మినీబైపాస్‌లోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమారి, మస్తాన్‌బీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళా సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. మద్యాన్ని ఆదాయవనరుగా మార్చుకున్న ప్రభుత్వం.. మహిళలపై దాడులకు, అత్యాచారాలకు కారణమవుతోందని ధ్వజమెత్తారు. ఐద్వా నగరాధ్యక్షురాలు సుబ్బమ్మ, శంషాద్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో..

నెల్లూరు(బారకాసు): మినీబైపాస్‌లోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాసరి ప్రసాద్ నివాళులర్పించారు. మురళి, హరి, రమేష్, ప్రతాప్, రామ్మోహన్, మహేష్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): మినీబైపాస్‌లోని పూలే దంపతుల విగ్రహాలకు మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ నివాళులర్పించారు.



కొండాయపాళెంలోని ప్రాథమిక పాఠశాలలో..



బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో..